క్లుప్తంగా

ముగిసిన కంటి వెలుగు సేవలు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏర్పాటు చేసి కంటివెలుగు శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. 10 కంటి వెలుగు కేంద్రాల్లో 1,39,441 మందికి సేవలు అందించాయి. ప్రత్యేక కళ్లద్దాలు 4093 మందికి అందజేశారు. 7047 మందిని శస్త్ర చికిత్సల కోసం సరోజిని కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. 108 రోజుల పాటు కంటి వెలుగు కేంద్రాలు విజయవంతంగా పని చేశాయి.

ఉద్యోగ విరమణ



మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో శుక్రవారం పలువురు ఉద్యోగ విరమణ పొందారు. అసిస్టెంట్ మేనేజర్ సరిత, ఏఎంఎఫ్ చందర్‌లు ఉద్యోగ విరమణ పొందటంతో డిపో మేనేజర్ మహమ్మద్ ఇస్సాక్ వారిని ఘనంగా సత్కరించారు. ఆర్టీసీకి ఎన్నో సేవలు అందించిన వీళ్లు ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని తోటి ఉద్యోగులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అశోక్, వెంకటేష్, జబ్బర్, రాజ్‌కుమార్, మధు, టిపి రెడ్డి, సీఎస్ గౌడ్, ఎస్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

ఆల్విన్‌కాలనీ: డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం జీహెచ్ఎంసీ రోడ్లు, జల మండలి అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇరు శాఖల అధికారులతో మాట్లాడి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పెండింగ్, జరుగుతున్న పనులు, నూతనంగా నిర్మించే డ్రైనేజీ లైన్ల పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, డీజీఎం వెంకటేశ్వర్లు, ఏఈ శ్రావణి, మేనేజర్ ఝూన్సీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ డివిజన్ ఉపాధ్యక్షుడు కాశీనాథ్ యాదవ్, శివరాజ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, షౌకత్ ఆలీ మున్నా, పోశెట్టిగౌడ్ పాల్గొన్నారు.

జీవితాంతం ప్రజా సేవలోనే ఉంటా



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మైనంపల్లి హనుమంతరావు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ప్రజల ఆదరాభిమానాలు ఉండటంతోనే కూకట్‌పల్లి నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను చేయగలిగానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కుటుంబ సభ్యుడిగా తనకంటూ ఓ ప్రత్యేక స్థానం కల్పించిన ఇక్కడి ప్రజలకు జీవితాంతం సేవలు చేస్తానన్నారు. శుక్రవారం ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్‌లోని వడ్డెరబస్తీ, మానస సరోవర్‌లో సీసీ రోడ్లు, వరద నీటి డ్రైనేజీ పనులకు రూ.3కోట్ల 45 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అభివృద్ధి పనులకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి శంకుస్థాపన చేశారు. మానస సరోవర్ నుంచి కానాజీగూడ ప్రధాన రహదారి వరకు నిర్మిస్తున్న వరద నీటి డ్రైనేజీ పనులను 8 – 12 నెలల్లో పూర్తి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, వాటర్ వర్క్స్ ఏఈ తేజ, కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గడ్డం నర్సింగ్ రావు, వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు అనిల్‌కిషోర్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, మన్నె ఉదయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచిత యూరియా హామీ ఏమైంది?

- కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు



కూకట్‌పల్లి: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలమైందని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాదవరం కాంతారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని కేపీహెచ్‌బీ డివిజన్‌లో వరలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన బీజేపీ భరోసా పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు పోయి యథేచ్ఛగా నెరవేరని హామీలను ప్రకటించి గద్దెనెక్కిందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి దళితుడేనని ప్రకటించి, దళితులకు మూడెకరాల భూమి అందిస్తామని, నిరుద్యోగ భృతి, కేజీ టు పీజీ ఉచిత విద్య ఏమైందని ప్రశ్నించారు. రైతులకు ఉచిత యూరియా అందిస్తామన్న మాట ఏమైందన్నారు.

◆ అకాల వర్షాలకు రైతులకు ఇస్తామన్న పంట నష్ట పరిహారం ఇంకెప్పుడు ఇస్తారన్నారు. కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకే దళిత బంధు ఎందుకు ఇస్తున్నారని, బీసీ బంధు పేరుతో మరో కొత్త నాటకానికి తెర తీశారని ఆరోపించారు. కేసీఆర్ మాయమాటలను నమ్మే పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరన్నారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినా వాటిని దారి మళ్లిస్తుండటమే కాకుండా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేందంటూ కేంద్రప్ర భుత్వంపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గంధం రాజు, జిల్లా స్వచ్ భారత్ కన్వీనర్ గురుప్రసాద్, సుధా రవి, మహేందర్, నాగలక్ష్మి, సులోచన, బి.రేవతి తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబకు ప్రత్యేక పూజలు



ఆల్విన్‌కాలనీ: ఆషాఢమాసం రెండో శుక్రవారం సందర్భంగా కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ ఫేజ్–2లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి మాతగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ వేదమంత్రాల సాక్షిగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రీ లలితా సహస్రనామార్చనలు, స్వామివారికి బిల్వ పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్తైదువలకు వాయినాలు అందుకొని ఆశీర్వాదం పొందారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో శనివారం మధ్యాహ్నం 12గంటలకు సామూహిక అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

వార్డు కార్యాలయంలో జెడ్‌సీ తనిఖీలు

మోతీనగర్: వార్డు కార్యాలయంలో సిటిజన్ చార్ట్‌ను తప్పకుండా అమలు చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమత పేర్కొన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే సిటిజన్ చార్ట్ ప్రకారం నమోదు చేసి పరిష్కరించాలని సూచించారు. అంతేకాకుండా ఎటువంటి సమస్యనైనా పరిశీలించి పరిష్కరించడానికి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి విభాగానికి వచ్చిన ఫిర్యాదును సకాలంలో స్పందించి వాటిని పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని తెలిపారు. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట డీసీ రవికుమార్, ఏఎంసీ మురళీ తదితరులు పాల్గొన్నారు.



అల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జెడ్‌సీ మమత తదితరులు

నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశానుసారం విద్యార్థులకు బ్యాగులు, నోట్‌పుస్తకాలు, వాటర్ బాటిళ్లు, పెన్సిల్స్, పెన్నులు ఉన్న కిట్లను పంపిణీ చేశారు.

ధరల పెంపుపై మహిళా కాంగ్రెస్ నిరసన

బాలానగర్: రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన నిత్యావసరాల ధరలకు నిరసనగా శుక్రవారం బాలానగర్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై మాట్లాడుతూ.. సామాన్యుడు కొనలేనంతగా కూరగాయల ధరలు పెరిగిపోయాయని అన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే పెరిగిన కూరగాయల ధరలు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయని పేర్కొన్నారు. చిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మధ్య తరగతి ప్రజలకు ధరలు భారంగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజనోల లక్ష్మి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, మేడ్చల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ జ్యోతి, టీపీసీసీ సెక్రటరీ బండారి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రహిత రవాణా సౌకర్యం కల్పిస్తాం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లోని గౌతమినగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. యూజీడీ, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. మీ కాలనీ, బస్తీల్లో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు గంగాధర్, కోటేశ్వరరావు, రాంబాబు, వంశీ, సీతారాం, సతీష్, మస్తాన్, సంతోష్, మోహన్, వెంకట్, శివ, కుమారి, భవని, ఆశ, శ్రీకన్య, లత, కల్పన పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్స్ క్లబ్ హైదరాబాద్ జిల్లా సెక్రటరీ లయన్ అన్నెం కోటిరెడ్డి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కమిటీ సెక్రటరీగా మూసాపేట అవంతికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లయన్ అన్నెం కోటిరెడ్డిని నియమిస్తూ శుక్రవారం గవర్నర్ లయన్ లక్ష్మి నియామకపత్రాన్ని అందజేశారు.

◆ ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ... ప్రతి క్లబ్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఒక శాఖను ఏర్పాటు చేసి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను చేపట్టే విధంగా కృషి చేస్తామన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణాన్ని కాపాడినప్పుడే సకాలంలో వర్షాలు పడతాయని అన్నారు. సమృద్ధిగా పంటలు పండి రైతులు సంతోషంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పెళ్లి రోజు, పుట్టిన రోజుల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.